క్లుప్తంగా

మోడల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

కోడుమూరు రూరల్: స్థానిక మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికిగాను నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మండలంలోని అల్లినగరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరళాదేవి గురువారం తెలిపారు. తమ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా అందరూ అర్హత సాధించారని హెచ్‌ఎం వివరించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయునులు అభినందించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదో తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో అధిక మార్కులు సాధించిన కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కురువ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పాపారాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతిలో 500కు పైగా మార్కులు వచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 550 పైగా మార్కులు వచ్చిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్‌లో 850కి పైగా మార్కులు వచ్చిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, 900 మార్కులకు పైగా వచ్చిన ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు అర్హులన్నారు. తమ మార్కుల మెమో, కులధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను ఈనెల 5లోపు 9440756199, 9032741194 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రూరల్): కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. అర్హులైన వారు ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రూరల్ పరిధిలో 3 సెంట్లు, అర్బన్ పరిధిలో 2 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అధికారుల కోసం చూడకుండా..!


పైపులైన్ పనులు చేసుకుంటున్న కాలనీవాసులు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు ఎస్సీ కాలనీలో గురువారం ఉదయం హంద్రీ నది నుంచి నీరు సప్లై చేసే పైపు లైన్ జాయింట్ తెగిపోయింది. కాలనీ వాసులు నీటి కోసం మధ్యాహ్నం వరకు ఇబ్బందులు పడ్డారు. అధికారుల కోసం వేసి చూడకుండా ఎస్సీ కాలనీకి చెందిన కొందరు తెగిన పైపులైన్‌ను సరి చేసుకున్నారు. ఇనుప పైప్‌లైన్ కావడంతో అధికారులు స్పందించి వెల్డింగ్ వేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మిరప రైతుకు వర్షం భయం

పాణ్యం: అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పగలంతా ఎండలు ఉండడం.. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు మిరప పంటను కుప్ప నూర్చి ఆరబెట్టుకున్నారు. అయితే గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడం.. మరోవైపు ఈదురుగాలులు వీచడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. పట్టాలు కప్పేందుకు తంటాలు పడ్డారు. చినుకులు రాలి ఆ తర్వాత ఆగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం


పూలే విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): కులగణన ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం చేసిన పోరాటాలు ఎట్టకేలకు ఫలించాయని సంఘం జిల్లా అధ్యక్షుడు దళపతి ధర్మ అన్నారు. కులగణన చేపట్టేందుకు కేంద్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ సంఘం నేతలు గురువారం సాయంత్రం బిర్లాగేట్ సర్కిల్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడుతూ.. 1931 నుంచి దేశంలో కులగణన జరగలేదని, బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంవత్సరాలుగా కులగణన జరగాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్ రావు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశాభివృద్ధికి పట్టుకొమ్మలుగా, ఉత్పత్తి కులాలుగా, శ్రామిక వర్గంగా ఉన్న బీసీల సాధికారత కులగణన చేయడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గత నెల 27వ తేదీన ఇదే అంశంపై విజయవాడలో మహా ర్యాలీ నిర్వహించగా, పోలీసులు భగ్నం చేసి అరెస్టులు చేశారన్నారు. ఇప్పటికైనా కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామమన్నారు. కులగణనను నిష్పక్షికంగా చేపట్టాలని కోరారు.

కార్మికులకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కార్మికులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు ముజఫర్‌నగర్‌లోని ఏపీ ఎస్‌బీసీఎల్ లిక్కర్ గోడౌన్ వద్ద వైఎస్సార్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. లక్ష్మీపురం పరిధిలోని భారత్ గ్యాస్ డ్రైవర్స్, హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలోనూ కాటసాని పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో 28, 29వ వార్డు కార్పొరేటర్లు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

☛ కల్లూరు ఎస్టేట్, ఏపీ సీడ్స్, రైస్ మిల్, సిల్వర్ ఫ్యాక్టరీ, ఒంటెద్దు బండ్ల యూనియన్, హమాలి, రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ, సీపీఎం నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, కృష్ణ, మధు, రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

పాణ్యం: మండలంలో మే డే ఉత్సవాలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. బస్టాండ్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో, పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో కార్మికుల జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఐకమత్యంతో ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజా, వ్యవసాయ సంఘం నాయకులు ఖాశీం, దావీదు, కేజే శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

☛ పాణ్యం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఏఈ మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

గడివేముల: స్థానిక కొత్త బస్టాండు వద్ద మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మికులు, ఆటోయూనియన్స్, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లసుబ్బయ్య, ఆశా, శ్యామలమ్మ, మేరమ్మ, గోకర్‌సా తదితరులు పాల్గొన్నారు.


గడివేముల కొత్త బస్టాండ్ వద్ద కార్మిక జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు


గడివేముల కొత్త బస్టాండ్ వద్ద కార్మిక జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల ప్రాణత్యాగ ఫలితమే మేడే

కోడుమూరు రూరల్: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కోడుమూరులో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు వాడవాడలా ఎర్రజెండాలను ఆవిష్కరించి మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ, సీపీఎం జిల్లా నాయకులు సుబహాన్ హాజరై ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు రాజు, గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. 139సంవత్సరాల కిందట ఎందరో నేతలు, కార్మికులు ప్రాణాలర్పించి 8 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చారన్నారు. ఎందరో త్యాగధనుల ఫలితమే ఈరోజు కార్మికులకు స్వేచ్ఛ కలిగిందన్నారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు రాముడు, నాగరాజు, దూళ్ల భాస్కర్, వీరన్న, మద్దిలేటి, సులోచనమ్మ, బజారి, సుంకన్న, తిప్పన్న, మధు, చిన్న, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

☛ కోడుమూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్మికులు గ్రామ సర్పంచ్ భాగ్యరత్న చేతుల మీదుగా కేక్ చేయించి సంబరాలు జరుపుకున్నారు.ఈఓ అజయ్‌భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

☛ గూడూరు మండలంలోని గూడూరు, కె.నాగలాపురం గ్రామాల్లో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు ఎర్రజెండాలను ఆవిష్కరించి మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు సుభాన్, మండలాధ్యక్షుడు గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాలకై చికాగో నగరంలో 1886 సంవత్సరంలో జరిగిన పోరాటంలో వేలమంది కార్మికులు ప్రాణాలను కోల్పోయారని, వారి ప్రాణత్యాగ ఫలితమే నేటి మేడే అని ఏఐటీయూసీ కోడుమూరు, సి.బెళగల్ మండలాల అధ్యక్షులు మల్లికార్జున, రాజు అన్నారు. స్థానిక డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ఆవరణలోని జరిగిన మేడే ఉత్సవాలలో వారు కార్మికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున, రాజు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని కార్మికులు, ఏఐటీయూసీ హమాలీ యూనియన్ సభ్యులకు ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, మేడే గొప్పతనాన్ని వివరించారు. అదేవిధంగా కార్మికుల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హక్కులు, చట్టాలను వివరించారు. సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా సభ్యులు స్థానిక బస్టాండ్ ఆవరణలో అరుణ వర్ణ జెండాను ఎగురవేసి మేడేను ఘనంగా జరుపుకున్నారు.


కోడుమూరులో అరుణ వర్ణ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల నాయకులు


గూడూరులో జెండావిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


సి.బెళగల్‌లో కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజశ్యామల దేవికి ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షయ తృతీయ, రాజశ్యామల అమ్మవారి జయంతి సందర్భంగా గణపతి శ్రీలక్ష్మీ నారాయణ మూల మంత్ర సహిత అంగ ఉపాంగ ప్రత్యంగ దేవతా సహిత శ్రీ రాజశ్యామల మూల మంత్ర పూజలు, రాజశ్యామల సహస్రనామ హోమం తదితర పూజలను విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేఎంసీ ఎస్‌ఓకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్‌ఓ)గా పని చేస్తున్న ఎన్ఎస్‌వీ రమణమూర్తికి పదోన్నతి లభించింది. ఆయనకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి వైజాగ్‌లోని ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. జీఎంసీలో 2014 నుంచి 2022 వరకు ఆయన తన సేవలను అందించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలోనూ ప్రత్యేక అధికారిగా కీలక పాత్ర పోషించారు.

ఏపీసీసీ కార్యాలయంపై దాడి తగదు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంపై బీజేపీ గూండాలు దాడి చేయడం తగదని మాజీ ఎమ్మెల్సీ, డీసీసీ మాజీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు అన్నారు. గురువా రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి జరిగిందంటే రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరమన్నారు. గతంలో టీడీపీ ఆఫీస్‌పై దాడి చేస్తే చంద్రబాబు ఏ విధమైన చర్యలు తీసుకున్నారో, ఎవరెవరిపై కేసులు పెట్టారో అదే రీతిలో ఏపీసీసీ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పర్యవసానం మరో విధంగా ఉంటుందని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను గృహనిర్బంధం చేయడమేంటని ప్రశ్నించారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బజారన్న, బీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుసేన్, నాయకులు ఖాద్రి బాషా, రియాజుద్దీన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామంలో గురువారం ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. లబ్ధిదారులకు ప్రతినెలా పెన్షన్ సక్రమంగా అందుతుందా, అని కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మాధురి, ఎంపీడీఓ రఘునాథ్, రూరల్ తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు అందజేసే పింఛన్లను గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి అందజేయాలని గూడూరు ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని గుడిపాడులో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 3208 పింఛన్లు ఉన్నాయని, తొలిరోజు 95 శాతం మందికి సొమ్ము పంపిణీ చేసినట్లు తెలిపారు. 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.


గుడిపాడులో లబ్ధిదారురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్


పోలకల్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

పింఛన్ల పంపిణీని తనిఖీ చేసిన ఎంపీడీఓ

సి.బెళగల్: మండలంలో గురువారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ సి బ్బంది చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమా న్ని ఎంపీడీఓ రాణెమ్మ తనిఖీ చేశారు. పోలకల్ గ్రామంలో ఉద్యోగులు వీధుల్లో పింఛన్ పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొందరికి ఎంపీడీఓ పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 7,064 మంది లబ్ధిదారులు ఉండగా మొదటి రోజు 6,520 మందికి (92.30 శాతం) పింఛన్ పంపి ణీ పూర్తయ్యిందని ఎంపీడీఓ తెలిపారు.

పింఛన్ల పంపిణీ

కల్లూరు: కల్లూరు అర్బన్ 37వ వార్డులో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు.

☛ కల్లూరు అర్బన్ 31వ వార్డులో బీసీ యాదవ సాధికారిక సమితి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

☛ కల్లూరు గ్రామీణ ప్రాంతాల్లో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి తెలిపారు. పర్ల గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పింఛన్ అందిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

జాతీయ రహదారి పనులను పూర్తి చేయండి

కర్నూలు(అర్బన్): జాతీయ రహదారి 340సీ కి సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎన్‌హెచ్ పీడీని ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం, మిలటరీ కాలనీ, గార్గేయపురం చెరువు వద్ద పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులకు భూసేకరణ పూర్తి చేసి భూమిని స్వాధీనం చేసి నెల రోజులైనా ఇంకా పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టర్లను పిలిపించి వారితో మాట్లాడి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎన్‌హెచ్ 340 ఆపరేషనల్ మెయింటెనెన్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సీసీ కెమెరాల నిర్వహణను పరిశీలించారు. జాతీయ రహదారుల్లో వాహనాల కదలికలు, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సీసీ కెమెరాల పనితీరు తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ 340సీ పీడీ పద్మజ, ఎన్‌హెచ్ ఆర్ అండ్‌బీ ఈఈ శంకర్‌రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ రమేష్‌బాబు, నేషనల్ హైవేస్ డిప్యూటీ కలెక్టర్ సునీతాబాయి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో ఉర్దూ వర్సిటీని ఏర్పాటు చేయొద్దు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ఆవరణలో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు భజరంగ్‌దళ్ నాయకు లు స్పష్టం చేశారు. గురువారం ఆ కాలేజీ ఆవరణ లో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆ దళ్ జిల్లా కన్వీనర్ సాయిరాం మాట్లాడుతూ.. పురుషుల డిగ్రీ కాలేజీలో ఇప్పటికే గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, రూసా నిధులతో కొత్తగా నిర్మించిన భవనం తగిన వసతులతో అందుబాటులోకి రాలేదన్నారు. ఇలాంటి సమయంలో ఉర్దూ యూనివర్సిటీకి తాత్కలికం పేరుతో కాలేజీ భవనాలను కట్టబెటేందుకు ఉన్నత విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. భజరంగ్ దళ్ నాయకులు శివసాయి నాథ్, గుజరాత్ సురేష్, తేజ, జయప్రకాష్ సింగ్, ఉపేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయినాథుని రథోత్సవం

- 2న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు
- 3న రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు


పులకుర్తిలో వెలసిన సాయినాథుడు

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి 4వ మహా రథోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలియజేశారు. వేడుకల్లో భాగంగా గురువ్వారం సాయినాథుడి ప్రభోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

సాయినాథుడి రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో ప్రథమ బహుమతి రూ.8 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున అందజేయనున్నట్లు గ్రామస్తులు చెప్పారు.


సాయినాథుడి ప్రభోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

3న వృషభాల బండలాగుడు పోటీలు

సాయినాథుడి రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీన రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.30 వేలు, 2వ బహుమతి రూ.25 వేలు, 3వ బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.15 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

పగలే వెన్నెల


సచివాలయం వద్ద పట్టపగలే వెలుగుతున్న లైటు



ఆరోగ్య కేంద్రం వద్ద వీధి లైటు

కర్నూలు(రూరల్): భవిష్యత్ తరాల కోసం విద్యుత్‌ను పొదుపు చేయాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బి.తాండ్రపాడు-1 సచివాలయం, విలేజ్ క్లినిక్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న లైటు, బీసీ కాలనీలో కొద్దిరోజులుగా వీధి లైట్లు పట్టపగలు కూడా వెలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండే వేసవిలో పట్టపగలు సైతం వీధి దీపాలు వెలుగుతుండటంతో విద్యుత్‌తో పాటు ప్రజాధనం వృథా అవుతోందని పులువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలి

సి.బెళగల్: ప్రభుత్వ అనుమతులున్న నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఓ మల్లేష్‌కుమార్ విత్తన, ఎరువు, పురుగు మందుల డీలర్లను హెచ్చరించారు. ఆయన గురువారం సి.బెళగల్‌లోని విత్తన విక్రయ దుకాణాలు శివసాయి, జైష్ణవి ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే అమ్మాలని, తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని, అదేవిధంగా ప్రతి అమ్మకంపై రసీదు ఇవ్వాలని ఆదేశించారు. అధిక ధరలకు అమ్మినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా లూజు విత్తనాల అమ్మకాలపై సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. ఆయా దుకాణాల్లో విత్తన శ్యాంపిల్స్ సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం విశాఖపట్నం, తాడేపల్లిగూడెం ల్యాబ్‌లకు పంపనున్నట్లు వెల్లడించారు.


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

కర్నూలు (టౌన్): నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అవి లోపిస్తే సంబంధిత అధికారులదే బాధ్యత అని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక కొత్తపేటలో నిర్మించిన మురుగు కాల్వలను ఆయన గురువారం పరిశీలించారు. అంతకుముందు పాత కంట్రోల్ రూమ్, పెద్ద పడఖానా, అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రూ.44.47 కోట్లతో 330 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో కొన్ని పూర్తి చేశామని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎంఈ సత్యనారాయణ, డీఈఈ గంగాధర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.


కొత్తపేటలో మురుగు కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు